నిఘా నీడలో..



- కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం
- 8 చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు
- గతంలో అధికారులపై వరుస దాడులు
- జోరుగా దళారుల దందా
- సీసీ కెమెరాల పర్యవేక్షణతో చెక్





సుభాష్‌నగర్: గాజులరామారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయం నిఘా నీడలోకి వెళ్లింది. అధికారులపై తరచూ దాడులు, మరోవైపు దళారులకు చెక్ పెట్టేందుకు అధికారులు 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గ్రేటర్‌లోని కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో రెండు సర్కిళ్లకు గాను 8 డివిజన్లు ఉన్నాయి. ఇక్కడ తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు సైతం నివసిస్తూ ఉండడంతో కుత్బుల్లాపూర్ మినీ ఇండియాగా మారిందని చెప్పుకోవచ్చు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ జనాభా ఇక్కడ నివసిస్తుంటారు. ఇందులో 70 శాతం స్లమ్ ఏరియాల్లోనే ఉంటున్నారు. అదే స్థాయిలో రోజువారీగా వివిధ పనుల కోసం కుత్బుల్లాపూర్ తహసీల్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో జనాలు వస్తుంటారు. అయితే చాలామంది నిరక్షరాస్యులు కాగా సరైన అవగాహన లేక అధికారులతో వాగ్వాదానికి దిగడం, దాడులు చేయడం పరిపాటిగా మారింది. గతంలో పని చేసిన పలువురు తహసీల్దార్లపై కూడా దాడులు జరిగాయి. దీనికి తోడు కార్యాలయం బయట దళారులు దందా సాగిస్తున్నారు. అంతే గాకుండా కార్యాలయ ఆవరణలో పార్కింగ్ చేసిన వాహనాల్లోని వస్తువులు చోరీకి గురయ్యాయి. వీటిని అరికట్టేందుకు సంబంధిత అధికారులు సీసీ కెమెరాలు అందుబాటులోకి తెచ్చారు.


కార్యాలయంలో అమర్చిన సీసీ కెమెరా

పలుమార్లు దాడులు..

1992లో షాపూర్‌నగర్‌లో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్ కార్యాలయంలోకి నలుగురు నక్సలైట్లు సైకిళ్ల పై వచ్చి బాంబు విసిరారు. అయితే అదృష్టవశాత్తు స్వల్పంగా పేలడంతో ఫర్నిచర్ ధ్వంసమై డాక్యుమెంట్లు చెల్లాచెదురు అయ్యాయి. అప్పటి తహసీల్దార్ పాండురంగారావు ఆ సమయంలో లేకపోవడంతో ప్రాణాలతో బయటపడ్డాడు.

- తహసీల్దార్ గౌరీ వత్సల ఉన్న సమయంలో సర్వే నంబర్ 79 లోని కొంతమంది కబ్జారాయిలు కలెక్టర్‌తో పాటు ఆమెపై దాడి చేశారు. అప్పట్లో కొన్ని రోజులపాటు కార్యాలయ ఆవరణలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.
- సూరారంలో తహసీల్దార్ మైపాల్ రెడ్డి ఉన్నప్పుడు ఏకంగా 30 మంది దుర్భాషలాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించారు. అప్పట్లో కొంతమంది పై కేసు నమోదు చేయడం జరిగింది.
- గాజులరామారంలోని ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను 2013లో పెద్ద ఎత్తున కూల్చివేయగా కోపోద్రిక్తులైన స్థానికులు పెద్ద ఎత్తున కార్యాలయం పై రాళ్లు విసురుతూ అధికారులపై దాడికి ప్రయత్నించారు. దీంతో తహసీల్దార్ ఇతర సిబ్బంది పరుగులు పెట్టారు.
- ఇలా పదుల సంఖ్యల్లో దాడులు చేసిన వారిని గుర్తించేందుకు అప్పుడు సీసీ కెమెరాలు లేకపోవడంతో చాలామంది తప్పించుకున్నారు.

దళారులకు చెక్

కొందరు అమాయకులను బుట్టలో వేసుకొని అధికారి వద్ద పనిచేసే పెడతామని పెద్ద మొత్తంలో డబ్బులు గుంజుతున్నారు. ఇప్పుడు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఏర్పాటుతో దళారుల దందాకు చెక్ పడినట్లయ్యింది.

ఇక ఆటలు సాగవు..



వివిధ పనుల కోసం కార్యాలయానికి జనాలు నిత్యం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వారి కదలికలు గమనించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. భద్రతతో పాటు, దళారులకు సైతం భయం ఉండేలా మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం.

– మల్లికార్జున్ రావు, డిప్యూటీ తహసీల్దార్

కాలేజీల మెస్‌లను హాస్టల్స్‌గా మార్చాలని వినతి


రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల మెస్‌లను స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌గా మార్చాలని కోరుతూ స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు చంద్రశేఖర్, అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల మెస్‌లను ప్రైవేట్ ఏజెన్సీలు నడిపిస్తున్నాయని, వారం రోజులుగా విశ్వ విద్యాలయ మెస్‌ల టెండర్ల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, పలు వార్తా పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్నారు. దీని కారణంగా విశ్వ విద్యాలయ ప్రతిష్ఠ దెబ్బతినే ఆస్కారం ఉందన్నారు. గతేడాది నుంచి అనేకసార్లు ప్రైవేట్ ఏజెన్సీలు నడిపిస్తున్న మెస్‌ల్లో ఆహారం కల్తీ అయినా ఘటనలు జరిగాయన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలు అయిన జగిత్యాల, సుల్తాన్‌పూర్, మంథని, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు, సిరిసిల్ల అన్ని కళాశాల మెస్‌లను స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్స్‌గా కన్వర్టు చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకృష్ణ, సిద్ధార్థ, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి


వేడుకల్లో అధ్యక్షుడు మాధవచారి, కమిటీ సభ్యులు

మోతీనగర్: హిందూవాహిని అధ్యక్షుడు మాధవచారి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హిందూ ధర్మ పరిరక్షకుడు మహారాణా ప్రతాప్ 485 జయంతి వేడుకలను శుక్రవారం రాణా ప్రతాప్‌నగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హిందూవాహిని కూకట్‌పల్లి బాగ్, అల్లాపూర్ డివిజన్, మోతీనగర్ డివిజన్ మాజీ జనరల్ సెక్రటరీ సీహెచ్. వెంకటరామిరెడ్డి, మల్కాజ్‌గిరి ఓబీసీ మోర్చా కార్యదర్శి గోనెల సుదర్శన్ ముదిరాజ్, జీత్తు, సంతోష్, రవి, ప్రసాద్, మోహన్, లింగం, సాయిలు, రామ్‌రెడ్డి, రాజయ్య చారి, రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సందర్శన


హెల్త్ సెంటర్‌ను పరిశీలించిన సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: మండల సీపీఎం నాయకులు కూకట్‌పల్లి అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం. శంకర్, నాయకులు పి. ధర్మారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి మండలంలో లక్షలాదిగా జనాభా ఉంటే కేవలం అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్ మాత్రమే ఉందని, దీనిద్వారా ఇక్కడి ప్రజలకు సరైనా వైద్యం అందడం లేదన్నారు. గర్భిణులకు ప్రసూతి సౌకర్యం కూడా అందుబాటులో లేదని, దీంతో దూర ప్రాంతమైన కొండాపూర్ ఏరియాసుపత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ ఆసుపత్రి బిల్డింగ్‌ను 50 పడకలుగా నిర్మించాలని కోరారు. అలాగే ఈనెల 12న కలెక్టర్ ఆఫీస్ వద్ద తలపెట్టిన ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు

కుత్బుల్లాపూర్: చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, శ్రీ వేంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు వరద రాజు, శ్రీశైలం యాదవ్, నరేశ్, రాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ క్యాంపస్‌లో వీసీ పర్యటన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లో వీసీ ప్రొ. కుమార్ శుక్రవారం పర్యటించారు. హెల్త్ సెంటర్, స్విమ్మింగ్ పూల్, సీఎఫ్ఆర్డీ భవనం, ఎస్ఆర్ఎస్, ఇతర హాస్టళ్లలో పర్యటించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు విద్యార్థులు, ఉద్యోగులు, వాకర్స్ కృషి చేయాలన్నారు. వీసీతో పాటు ఇతర అధికారులు క్యాంపస్‌లో పర్యటించి వివిధ కార్యాలయాల్లో పనితీరును, సమస్యలను అడిగితెలుసుకున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మూసాపేట: కైత్లాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 10న (నేడు) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భీమ లింగప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 9.30 వరకు వివేక్‌నగర్, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, పీపుల్స్, ఓమిని హాస్పిటల్స్ వెనుక ప్రాంతం, బాలాజీనగర్ దర్గా ప్రాంతాలు. అలాగే 9.30 నుంచి 10 వరకు రాజీవ్‌గాంధీనగర్, సర్దార్‌నగర్, కైత్లాపూర్ ఫ్లైఓవర్, కేపీహెచ్‌బీ 15వ ఫేజ్, రాఘవేంద్ర బస్తీ ప్రాంతాలు. 10.30 నుంచి 11 గంటల వరకు బాలాజీనగర్, సాయిబాబా ఆలయం రాందేవ్‌రావ్ ఆసుపత్రి ప్రాంతాలు, కేపీహెచ్‌బీ 7వ ఫేజ్, వాటర్ వర్క్స్ కార్యాలయం. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు మూసాపేట, గూడ్స్ షెడ్ రోడ్డు, ఎస్‌పీ నగర్, అంబేడ్కర్ నగర్, న్యూ బాలాజీనగర్, వివేక్‌నగర్, పీపుల్ హాస్పిటల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ అలివేలు మంగమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తెలంగాణ దోస్త్ నోటిఫికేషన్ విడుదలైందని, మరిన్ని వివరాలకు కళాశాలలోని హెల్ప్‌లైన్ సెంటర్‌లో కోఆర్డినేటర్ సాయికొండల్, నాగార్జునను సంప్రదించాలని సూచించారు.

నాగలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం


పూజల్లో కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్, సభ్యులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని దత్తాత్రేయకాలనీలో గల నాగలింగేశ్వర స్వామి ఆలయ ఏడో వార్షికోత్సవం సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిల్లా గణేశ్ హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో నాగభూషణం, కృపాకర్ గౌడ్, యాదగిరి, శంకర్ గౌడ్, మహేశ్, ఆదర్శ్, పోశెట్టి గౌడ్, నాగార్జున, దేవేందర్, రామకృష్ణ, అరుణ్ పాల్గొన్నారు.

బాలానగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం


సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నరసింహారాజును సన్మానిస్తున్న నాగిరెడ్డి తదితరులు

మూసాపేట: ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఎంపికైన టి. నరసింహారాజును కూకట్‌పల్లి కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు డాక్టర్ పట్లోళ్ల నాగిరెడ్డి, వెంకటేశ్ యాదవ్, తెలుగు వెలుగు దినపత్రిక ప్రతినిధి జగదీశ్ శుక్రవారం బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 10 మంది అత్యుత్తమ పోలీస్ అధికారుల్లో నరసింహారాజు కూడా ఉండడం ఆయన పనితీరుకు నిదర్శమన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పేర్కొన్నారు. మందులబస్తీ శ్మశాన వాటికలో పలు అభివృద్ధి పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ. 50 లక్షల నిధులతో పనులు చేపట్టామని నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, సీనియర్ నాయకులు గడ్డం నర్సింగరావు, బుర్రి యాదగిరి, దేవేందర్, రాజు, మందుల బస్తీ కమిటీ సభ్యులు శ్రీధర్, శ్రీనివాస్, కమల, రాజ శేఖర్, గణేశ్, రవీందర్, జగన్నాథం, రఘు, మహేశ్, మధు, మోహన్, ప్రవీణ్, రాజేందర్, ముఖేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలి


రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం తదితరులు

కూకట్‌పల్లి: ఉగ్రవాదంపై భారత్ జరుపుతున్న ధర్మ యుద్ధంలో 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని, అలాగే దేశ ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ ఏకతాటిపై నిలిచి దేశానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మాధవరం రంగారావు, తూము శ్రావణ్‌కుమార్, పగడాల బాబురావు, ఆలయ చైర్మన్ తులసీరావు తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో ఫతేనగర్ కార్పొరేటర్..

బాలానగర్: 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని కోరుతూ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ శివాలయంలో మహా శివుడికి అభిషేకం, హనుమాన్‌కు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, కుక్కల రాము ముదిరాజ్, చెరుకు శివశంకర్ గౌడ్, బసవరాజు, కరుణాకర్, సతీశ్, కురుమయ్య, రవి పాల్గొన్నారు.

బైక్‌పై కుక్కను వెంబడిస్తూ వచ్చి ఢీకొట్టారు

సనత్‌నగర్: బైక్‌పై కుక్కను వెంబడిస్తూ వచ్చిన ముగ్గురు యువకులు ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. లోతుకుంట వెంకటాపురం ప్రాంతానికి చెందిన మారి అనిత (35) ఆశావర్కర్‌గా పనిచేస్తుంది. తన బంధువు సునీల్‌తో కలిసి ఈనెల 6న సాయంత్రం జేబీఎస్ వైపు నుంచి ప్యారడైజ్ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతోంది. అదే సమయంలో పరేడ్‌గ్రౌండ్ తూర్పు గేటు దగ్గరకు రాగానే వెనుక నుంచి కుక్కను వెంబడిస్తూ బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వచ్చి వారిని ఢీకొట్టారు. ఈ ఘటనలో కిందపడిపోయిన అనిత తీవ్ర గాయాలకు గురయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ సారైన ఓయూ స్నాతకోత్సవం జరిగేనా..?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ స్నాతకోత్సవం గత ఏడాది జరగలేదు...ఈ సారైన జరిగేనా...? అని విద్యార్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. యూనివర్సిటీలకు స్నాతకోత్సవాల నిర్వహణ కీలకం...స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథుల నుంచి డిగ్రీ పట్టాలను, బంగారు పతకాలను అందుకోవడం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తారు. కానీ ఓయూ స్నాతకోత్సవాలు ప్రతి సంవత్సరం జరగడం లేదు. గత వీసీ ప్రొ.రవిందర్ వరుసగా స్నాతకోత్సవాలను నిర్వహించి వివిధ రంగాలలో విశిష్ట సేవలందించిన వారికి గౌరవ డాక్టరేట్లను కూడ ప్రదానం చేశారు. అయితే గత ఏడాది నుంచి స్నాతకోత్సవాల నిర్వహణ మళ్లీ పడకవేసింది. ప్రస్తుత వీసీ ప్రొ.కుమార్ గత ఏడాది స్నాతకోత్సవాన్ని నిర్వహించలేదు. ఈ సారైనా నిర్వహించాలని పీహెచ్‌డీ డాక్టరేట్లు, గోల్డ్‌మెడల్స్ సాధించిన విద్యార్థులు కోరుకుంటున్నారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సనత్‌నగర్: పార్కు చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ జెక్‌కాలనీ రోడ్ నెంబర్-4లోని క్లాసిక్ ఎవెన్యూకు చెందిన మహేష్ అంబాదాస్ పూరి ఈ నెల 2న రాత్రి 7 గంటల సమయంలో తన హోండా యాక్టివా బైక్ పై స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లాడు. అక్కడ బైక్ పార్కు చేసి స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పైపులైన్ పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద సుమారు రూ.2.50 లక్షలతో చేపట్టిన పైపులైన్ పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతినగర్ పరిసర ప్రాంతాల నుంచి వస్తున్న డ్రైనేజీ నీరు ఎల్లమ్మ చెరువులో కలవకుండా దారి మళ్లించేలా ఈ పనులు జరుగుతున్నాయన్నారు. ఇది పూర్తయితే చెరువు శుభ్రంగా ఉండడమే కాకుండా గుర్రపు డెక్క పెరగడం, దోమల బెడద వంటి సమస్యలు తొలగిపోతాయన్నారు. ఆయన వెంట యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, ఎంఆర్‌కే రెడ్డి, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలి



కూకట్‌పల్లి: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతనగర్ కాలనీ మూడో లైన్ వద్ద మంజీరా వాటర్ డ్రైనేజీతో కలిసి సరఫరా అవుతోంది. దీంతో కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు వాటర్ వర్క్స్ సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వెంటనే లీకేజీ పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ సూపర్‌వైజర్ నరేంద్ర, వాటర్ లైన్‌మెన్ శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

మోతీనగర్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తారని ప్రముఖ గైనకాలజిస్టు, నీలిమా ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నీలిమా శ్రీనివాసులు పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ పాండురంగ నగర్ పార్కు ఆవరణలో ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



సనత్‌నగర్: చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో చలనం లేకుండా పడి ఉన్నాడని ఈ నెల 5న ఉదయం 11 గంటలకు సనత్‌నగర్ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. మృతుడి సంబంధీకులు సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి

కుత్బుల్లాపూర్: మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో గండిమైసమ్మ పొదుపు సంఘానికి రూ.20 లక్షలు, సరోజిని మహిళా పొదుపు సంఘానికి రూ.18 లక్షలు, తిరుపతి పొదుపు సంఘానికి రూ.17 లక్షల చొప్పున మంజూరైన రుణ పత్రాలను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధి చెందితే వారి కుటుంబంతో పాటు దేశం సైతం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కుంట సిద్ధిరాములు, పొదుపు సంఘాల సభ్యులు పద్మ, అపర్ణ, దుర్గా దేవి, అంజలి, అన్నపూర్ణ, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ కార్మికురాలికి చేయూత

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో 20 ఏళ్లుగా హౌస్ కీపింగ్ ఉద్యోగిగా పని చేసిన నాగమణి (75)ని ఇటీవల వయోభారం కారణంగా ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ విషయాన్ని ఆమె కుమారులు కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సంస్థ మేనేజ్‌మెంట్‌తో చర్చించి ఆమెకు న్యాయం జరిగేలా కృషి చేశారు. ఈ క్రమంలో కంపెనీ ఆమెకు నెలవారీగా రూ. 2500 పింఛన్ రూపంలో అందించేందుకు అంగీకరించగా, ఉద్యోగం నుంచి తొలగించినందుకు నష్టపరిహారంగా రూ. 2 లక్షలు ఆమెకు ఇచ్చేలా ఒప్పించారు. ఈ సందర్భంగా మదన్‌గౌడ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏడుకొండలు, కార్మిక నాయకులు కె. సుభాష్, కె. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో విద్యా సంస్కరణలు చేపట్టాలి

ఏఐఓబీసీఎస్‌ఏ ఆధ్వర్యంలో విద్యా కమిషన్‌కు వినతి



రాయదుర్గం: రాష్ట్రంలో బీసీ విద్యార్థుల కోసం సమగ్ర విద్యా సంస్కరణలు అవసరమని కోరుతూ నగరంలో విద్యా కమిషన్‌కు ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ బృందం శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి కిరణ్‌కుమార్, కార్యదర్శి అరుణ్‌కేతన్, మురళీయాదవ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రామ్‌గౌడ్‌లతో కూడిన బృందం 5 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ముఖ్యంగా ప్రతిమండలం లో బీసీ హాస్టళ్లలో గ్రంథాలయాలు, శానిటేషన్, డిజిటల్ సదుపాయాలతో అభివృద్ధి చేయాలన్నారు. బీసీ సంక్షేమ ఇంటర్ కళాశాలలను పూర్తి స్థాయి డిగ్రీ కళాశాలలుగా మార్చాలని కోరారు. బీసీల కోసం ఉన్నత విద్యలో రెసిడెన్షియల్ సివిల్ సర్వీసెస్ కోచింగ్ సెంటర్లు ఏర్పాటు, హాస్టల్ విద్యార్థులు నెలవారీ జేబు ఖర్చులు, ఉచిత ఇంటర్నెట్ అందించాలని కోరారు. రాష్ట్రంలోని ఒక విశ్వవిద్యాలయానికి మహాత్మా జ్యోతిరావుఫూలే విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి జిల్లాలో నవోదయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ళు, కేంద్రీయ విద్యాలయాలను నెలకొల్పేలా కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఒత్తిడి చేయాలన్నారు.